06ATP27_06ATP27.qxd 10-11-2022 PM 10:18 Page 1



## జల్‌జీవన్ మిషన్‌తో తాగునీటి సమస్యకు శాశ్విత పరిష్కారం..!

- ఉరవకొండ నియోజకవర్గానికి మొదటి విడతగా రూ.8.65 కోట్లు - భూమిపూజచేసి పనుల ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


జల్ జీవన్ మిషన్ పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ, నవంబర్ 10 ప్రభాతవార్త : జల్‌జీవన్ మిషన్ పథకంతో ఉరవకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్విత పరిష్కారం లభించనుందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కణేకల్లు క్రాస్‌వద్ద గురువారం ఆయన జల్‌జీవన్ మిషన్ పనులను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి భూమిపూజ చేసి లాంఛనంగా ప్రారం భించారు. అనంతరం వై.విశ్వేశ్వరరెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ కింద నియోజకవర్గానికి మొదటి విడతగా 8.65 కోట్లు రూపాయలతోపాటు జగనన్న కాలనీల్లో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయడానికి 2.25 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయన్నారు. ఉరవకొండ పట్టణంలో 3.5 కోట్ల రూపాయలతో జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభించామని ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయడం జరుగుతుందని పనులు వేగవంతంగాపూర్తి చేయాలని అధికారులను సూచించడం జరిగిందన్నారు. రూరల్ మండలానికి 2.06 కోట్లు, కూడేరు మండలానికి 56 లక్షలు, విడపనకల్లు మండలానికి 2.78 కోట్లు, వజ్రకరూరు మండలానికి 2.37 కోట్ల రూపాయలు, బెలుగుప్ప మండలానికి 2.08 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. కూడేరు మండలం ఉదిరిపికొండ నుండి ఉరవకొండకు ప్రత్యేక తాగునీటి పైప్‌లైన్ కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిను కలిసి విన్నవిన్నంచగా 10 కోట్ల రూపాయలు మంజూరుకు అంగీకరించారన్నారు. సచివాలయానికి 20 లక్షల రూపాయల చొప్పున ఉరవకొండలో 5 సచివాలయాలకు కోటి రూపాయల నిధులు, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా సీసీ రోడ్లు, డ్రైనేజీల కోసం 5 కోట్ల రూపాయలురాగా పనులు జరుగుతున్నాయన్నారు. మండలానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 25 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైనేజీ, ఇతరత్రా పనులు చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి తోపాటు ఆయన కార్యాలయ వర్గాలతో ఇటీవల కలిసిన క్రమంలో పీఏబీఆర్ లింక్ ఛానల్ పునర్మించడానికి 30 కోట్ల రూపాయలు మంజూరు చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మీనుగ లలిత, ఎంపీపీ చందా చంద్రమ్మ, వైస్ ఎంపీపీ యం.నరసింహులు, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జోగి వెంకటేష్, ఉప సర్పంచ్ జి.వన్నప్ప, వార్డు సభ్యులు వశికేరి మల్లికార్జున, నీలూరి రత్న, చేజాల ప్రభాకర్, గురికాల ఓబుళమ్మ, ఎంపీటీసీ మంజుల, ఈడిగ ప్రసాద్, ఉరవకొండ పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్ల షేక్షావలి, కో ఆప్షన్ సభ్యుడు పామిడి సలీమ్, ఆర్‌డబ్ల్యూఎస్ సైట్ ఇంజనీర్ దాక్షాయణి, పంచాయతీ కార్యదర్శి కె.గౌస్‌సాహెబ్, మాజీ జెడ్పీటీసీ ఎస్.తిప్పయ్య, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి యం.బసవరాజు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు సి.ఓబులేసు, నాయకులు యం.అశోక్‌కుమార్, కరూరు వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

## తేదేపా నాయకుల అక్రమ అరెస్టులు అమానుషం-మల్లికార్జున


తేదేపా నాయకులతో మల్లికార్జున

మడకశిర నవంబర్ 10 ప్రభాతవార్త; నియోజకవర్గంకు చెందిన తేదేపా నాయకులను రాత్రి పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయడం అమానుష చర్య అని విశ్రాంత ఏఈ మల్లికార్జున గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పోలీసులు తేదేపా నాయకులను అరెస్టులు చేయడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. కేవలం ప్రశ్నించినందుకు అక్రమ అరెస్టులు చేయడం దారుణమని ఇలాంటి చర్యల వల్ల ప్రజల్లో అధికారపార్టీ మీద నమ్మకం సన్నగిల్లుతోందని అన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు.

## తేదేపా నాయకుల అక్రమ అరెస్టులను ఖండించిన మాజీ ఎమ్మెల్యే


సిఐతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈరణ్ణ

మడకశిర నవంబర్ 10 ప్రభాతవార్త; నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులను రాత్రికి రాత్రే అక్రమంగా అరెస్టులు చేసి పెనుకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని మాజీ ఎమ్మెల్యే ఈరణ్ణ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇది అత్యంత కిరాతకమైన చర్య అని మడకశిర చరిత్రలో గతంలో ఎన్నడూ ఇలాంటి దుర్మార్గమైన చర్యలకు ఏ ప్రభుత్వం పాల్పడలేదని అన్నారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అన్యాయంగా అక్రమంగా కొంతమందిని అరెస్టు చేసి పెనుకొండకు తరలించడం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. ఇలాంటి చర్యల వల్ల తేదేపా నాయకులను భయపెట్టాలనుకొంటే వ ృథా ప్రయాస అవుతుందని వైకాపా ప్రభుత్వం గ్రహించాలని అన్నారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్య విలువలను గౌరవించి అరెస్టు చేసిన తేదేపా నాయకులందరిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాధికారిక వక్కలిగ కన్వీనర్ వియం.పాండురంగప్ప, మాజీ ఎంపిపిలు ఎల్లోటి ఆదినారాయణ, అశ్వత్తామప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్, కన్వీనర్ రామాంజినేయులు, బిఎల్‌ఆర్ వీరకేతరాయ, తమ్మడేపల్లి హనుమంతరాయ, ఎంపిటీసి లింగరాజు, సునీల్, ప్రకాష్,లోకేష్, కిష్టప్ప, రమేష్, నరేష్, కరియన్న, శ్రీనివాసులు తదితర తేదేపా నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయం ముందు కార్ల డెమో శిబిరం

-కార్యాలయంకు వచ్చి వెళ్లడానికి ఇబ్బందులు పడ్డ ప్రజలు


మండల పరిషత్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన కార్ల కంపెనీ డెమో శిబిరం

ఉరవకొండ, నవంబర్ 10 ప్రభాతవార్త : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ద్వారానికి ఆనుకొని గురువారం ఒక కార్ల కంపెనీ డెమో శిబిరం ఏర్పాటు కావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. సాధారణంగా మండల కాంప్లెక్స్ ఆవరణంలోని ఒక మూలన ఎవరికీ ఇబ్బందులు లేని ప్రదేశంలో శిబిరాలు ఏర్పాటు చేసుకొని కార్లు, మోటార్ బైకుల డెమోలు నిర్వహించే కంపెనీలు ఏకంగా మండల పరిషత్ ప్రధాన ద్వారం పక్కనే శిబిరం ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులెవరిచ్చారన్న ప్రశ్న తలెత్తింది. ఈ క్రమంలో విలేఖరులు అక్కడికి చేరుకొని ఫోటోలు తీయడంతో గమనించిన మండల పరిషత్ సిబ్బంది సూచనలతో తేరుకున్న సదరు కార్ల కంపెనీ ప్రతినిధులు క్షణాల్లోనే డెమో శిబిరంను తొలగించారు. అయితే దాదాపు 2 గంటలపాటు డెమో శిబిరం కారణంగా మండల పరిషత్ కార్యాలయంలోకి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడటం కనిపించింది.

## వైఎస్ఆర్ జలకళ రైతులకు ఓ వరం


జలకళ బోరు డ్రిల్‌ను ప్రారంభిస్తున్నదృశ్యం

అమరాపురం, నవంబర్9 ప్రభాతార్త : మండల కేంద్రంలోని వీరాపురం గ్రామ సమీపంలో ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ జలకళ కార్యక్రమాన్ని జెడ్పిటిసి స్వారక్క నరసింహ మూర్తి, ఎంపిపి కెంకెరలు ప్రారంభించారు. ఈ కార్యక్రమం నందు ముఖ్య అతిథులుగా జెడ్పిటిసిటి ఎంపిపితోపాటు వైఎస్ ఎంపిపి కృష్ణమూర్తి, ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం అధ్యక్షులు చిక్కన్న, ఉపాధి హామీ పథకం ఏపీఓ కేంద్రీ, టెక్నికల్ అసిస్టెంట్ హనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు త్రిలోక్‌నాథ్ పొలంలో అమరాపురం మండలంలో తొలగిసారిగా వైఎస్ఆర్ జలకళ కింద బోరు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా జెడ్పిటిసి, ఎంపిపిలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు ఇచ్చిన హామీలతో వైఎస్ఆర్ జలకళ ద్వారా ఉచిత బోర్లు ఓ వరమని వారు తెలిపారు. ప్రస్తుతం ఈ పథకం కింద ఎంపికైన ప్రతి రైతుకు త్వరలోనే ఉచితంగా బోర్లు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య


అరెస్టు అయిన టిడిపి నాయకులు

అమరాపురం, నవంబర్ 10 ప్రభాతవార్త : మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మండల కన్వీనర్ శివరుద్రప్ప, సర్పంచ్ ధనుంజయ్య, మాజీ ఎంపిటిసి గణేష్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌గౌడ్, యువనాయుడు రఘు యాదవ్, మడకశిర పట్టణ నాయకుడు సుబ్బరాయుడు, పుల్లయ్యచౌదరి, చంద్రలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పెనుకొండ పోలీసు స్టేషన్‌కు తరలించడం హేయయమైన చర్య అని తెలుగుదేశం పార్టీ యువనాయుకులు శివకుమార్‌యాదవ్, కరీదాసన హట్టి కాంతరాజ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు జయకుమార్, పంచాయతీ కన్వీనర్ నాగరాజులు ఆరోపించారు. ఈ సందర్భంగా పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని.. ఏమాత్రం సమంజసం కాదని.. అర్థరాత్రి వేళల్లో అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పెనుకొండ పోలీసు స్టేషన్‌లోనున్న టిడిపి నాయకులను జిల్లా అధ్యక్షులు బి.కె పార్థసారథి, అమరాపురం మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, మాజీ ఎంపికి కృష్ణమూర్తి, జయకుమార్, నాగరాజు, పార్లమెంటు కార్యదర్శి నవీన్‌కుమార్, నవీన్, సిద్దేష్, జయరాం, ధనుంజయ్య, శకనప్ప, సాగర్ తదితరులు పరామర్శించారు.

## రైతుకు న్యాయం జరగకుంటే ఉద్యమం..

- భూ సేకరణ పేరిట అధికారుల జులుం
- మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం
- ఉమ్మడి జిల్లా యాదవ సంఘం నాయకులు


నాసన్ కంపెనీ ఎదుట రైతు కుటుంబం ధర్నానిర్వహిస్తున్న దృశ్యం

సోమందేవపల్లి, నవంబర్ 10 ప్రభాతవార్త : పరిశ్రమల పేరుతో సామాన్య రైతు నెత్తిన శఠగోపం. అధికారులే రైతుల పాలిట యమకింకరులు అయ్యారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కావేటి నాగేపల్లికి చెందిన రైతు రామయ్య యాదవ్‌కు నాసన్ కంపెనీ పక్కన 3.5 ఎకరాల పై చిలుకు భూమి ఉంది. 2013 భూ సేకరణ కింద నాసన్ కంపెనీ వారు 500 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించి వారికి ఎకరానికి 5 లక్షల చొప్పున నష్ట పరిహారం అందించారు. ఆ సందర్భంలో రామయ్య తన పిత్రాజీతం పక్కా రిజిస్టర్ అనుభవం గల భూమిని పంపిణీకి ఇవ్వలేదు. దీంతో అప్పటి నుంచి రైతుకు కష్టాలు మొదలయ్యాయి. ఏడెనిమిది సంవత్సరాలుగా భూమిని స్వాధీనం చేసుకోవడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ సందర్భంలోరైతు కోర్టును ఆశ్రయించడం జరిగింది. అయితే మంగళవారం రాత్రి వారి పొలానికి ఉన్న కంచెను అధికారులు, పోలీసుల సహకారంతో తొలగించి నాసన్ కంపెనీకి దారాదత్తం చేయడానికి సిద్ధపడ్డారు. దీనిపై రైతు ప్రశ్నిస్తే మీకు చెందాల్సిన నష్ట పరిహారం కోర్టులో చెల్లించడం జరిగిందని పేర్కొన్నారు. దీంతో భూమిని స్వాధీనం చేసుకోవడానికి రాత్రి పూట అధికారులు ప్రయత్నించడంతో ఉమ్మడి జిల్లా యాదవ సంఘం యువజన అధ్యక్షులు జిట్టా రామ్మోహన్, హిందూపురం పార్లమెంట్ యాదవ సంఘం నాయకులు వరప్రసాద్, జిల్లా నాయకులు బాలాజీ, మహేష్‌లు రైతుకు సంఘీభావంగా గురువారం నాసన్ కంపెనీ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. కోర్టులో కేసులు నడుస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు, పోలీసు వారు ఈ విధంగా దౌర్జన్యాలకు దిగడం తగదన్నారు. రైతుకు అన్యాయం జరుగుతుంటే ప్రజా పాలకులు ఎక్కడున్నారని ప్రశ్నించారు. రైతుకు జరిగిన అన్యాయంపై మానవ హక్కుల కమిషన్, హ్యూమన్ రైట్స్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో పోలీసు శాఖ రోడ్డుపై బైఠాయించిన వారికి నచ్చ చెబుతూ ధర్నా విరమించాలని, రెవెన్యూ అధికారుల ద్వారా మీకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ సమావేశంలో సోమందేపల్లియాదవ సంఘం నాయకులు మహేష్ యాదవ్, శివశంకర్‌యాదవ్, గంగాదర్ యాదవ్, నరసింహమూర్తి యాదవ్‌లతోపాటు అనంతపురం, హిందూపురం, గోరంట్లకు చెందిన యాదవ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తేదేపా పార్టీ శ్రేణుల అరెస్టు అక్రమం

- ఖండించిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి


విలేకర్లు సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, నవంబర్ 10 ప్రభాతవార్త : తెలుగు దేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను అరెస్టు అక్రమమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఖండించారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. సాధారణంగా అధికార పార్టీ నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడిన సందర్భాల్లో ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు అవినీతిని అరికట్టాలని అధికార పార్టీ నాయకులతో ఇళ్ల ముట్టడికి పిలుపునిస్తాయి. దాన్ని ప్రజాస్వామ్యంలో భాగమన్నారు. అయితే చరిత్రలో ఎన్నడు లేని విధంగా అధికారంలో ఉన్న పార్టీ ప్రతిపక్ష పార్టీ నేతల ఇంటిముట్టడికి పిలుపును ఇవ్వడం సిగ్గుచేటన్నారు. అంతేకాకుండా రోజురోజుకు టిడిపికి పెరుగుతున్న ఆదరణ చూడలేక స్థానిక ఎమ్మెల్యే పోలీసులు జోక్యంతో ప్రశ్నించిన వారిని అరెస్టు చేసి అప్రజాస్వామ్య చర్యలకు పాల్పడుతున్నాడన్నారు. అంతేకాక అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తున్నందుకు టిడిపి ముఖ్య నాయకులను, కార్యకర్తలను వారి కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురి చేసి అర్థరాత్రి సమయాన అక్రమ అరెస్టులు చేయడం దారుణమన్నారు. కార్యకర్తలను కాపాడుకోవడానికి ఎంత వరకు అయినా వెళ్తానని ఆయన పేర్కొన్నారు. తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదంటూనే ఎంఎల్ఎ అవినీతి అక్రమాలు ఎక్కువైన తరుణంలో ఒక బాధ్యతాయుత ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తున్నందుకు మా ఇళ్ల ముట్టడికి నీ ప్యాకేజీ రాయలను పంపడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు.

## టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథ్


టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రామగిరి, నవంబర్ 10 ప్రభాతవార్త : రాప్తాడు నియోజకవర్గ టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శిగా రాప్తాడు నియోజకవర్గం, రామగిరి మండలకేంద్రానికి చెందిన విశ్వనాథ్‌ని నియమించిన సందర్భంగా రామగిరి మండల ముఖ్యనాయకులతో పాటు వెంకటాపురంలో గౌరవపూర్వకంగా మాజీ మంత్రి పరిటాల సునీతను కలిశారు. వీరిలో ఎల్.నారాయణచౌదరి, రామ్మూర్తి నాయుడు ఘనంగాసన్మానించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌ని కూడారామగిరి మండల నాయకులు ఆధ్వర ంయలో ఘనంగా సత్కరించి పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని విశ్వనాథ్‌కి పరిటాలసునీత సూచించారు.

## భారీ వర్షాలకు కోతకు గురైన రహదారులు

- మరమ్మత్తుకు మోక్షమెప్పుడో..


బాలేపల్లి సమీపంలో కోతకు గురైన రహదారి

గుడిబండ, నవంబర్ 10 ప్రభాతవార్త : మండల వ్యాప్తంగా ఈ వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్లు కోతకు గురయ్యాయి. మండల కేంద్రానికి చివర్లో ఉన్న బాలేపల్లి గ్రామానికి వెళ్లే రహదారి కోతకు గురవ్వడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆదోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల రహదారుల్లో నిర్మించిన కల్వర్టులు తెగిపోవడంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే కొంకల్లు, జవనడుకు, ఫళారం గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఉన్న కల్వర్టులు తెగిపోవడంతో రాకపోకలకు ప్రయాణికులు, పాదచారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రహదారుల శాఖ అధికారులు చొరవ చూపడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకుని ప్రమాదాలు జరగకముందే మరమ్మత్తులు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఫోటోగ్రాఫర్ ఇంట్లో చోరి

-విలువైన ఫోటో కెమెరా, వెండి వస్తువుల అపహరణ

-ఆధారాలు సేకరించిన అనంతపురం క్లూస్ టీం


ఇంట్లో బద్దలు కొట్టిన బీరువాలను పరిశీలిస్తున్న ఎస్ఐ టి.పి.వెంకటస్వామి, క్లూస్ టీం అధికారులు

ఉరవకొండ, నవంబర్ 10 ప్రభాత వార్త : పట్టణంలోని 11వ వార్డు పార్కు ఆంజినేయస్వామి ఆలయం ముందుగల ఫోటోగ్రాఫర్ హరినాధ్ ఇంట్లో గురువారం తెల్లవారుజామున చోరి జరిగింది. హరినాధ్ వైద్య చికిత్సల నిమిత్తం దాదాపు పక్షం రోజులుగా హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో ఉంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న దొంగలు చోరికు పాల్పడినట్లు తెలుస్తోంది. ఉదయం ఇంటి తాళం తెరిచి ఉండటంతో గమనించిన పక్కింటి వారు విషయాన్ని ఇంటి యజమానికి ఫోన్‌చేసి తెలియజేయగా స్థానికంగా ఉండే ఇతర కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకొని గమనించగా చోరి జరిగిందని నిర్ధారించారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ టి.పి.వెంకటస్వామి సిబ్బంది చోరి జరిగిన ఇంటికి చేరుకొని పరిశీలించారు. ఇంటిగేటు మొదలు మూడు గదుల తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు రెండుగదుల్లోని 3 బీరువాలను బద్దలుకొట్టి అందులో ఒక విలువైన ఫోటో కెమెరా (దాదాపు లక్షరూపాయలు)ను, వెండివస్తువులను ఎత్తుకెళ్లినట్లు నిర్ధారణ అయింది. బీరువాలో మరొక విలువైన కెమెరా అందుబాటులో ఉన్నా ఒక కెమెరాను మాత్రమే దొంగలు ఎత్తుకెళ్లడం విశేషంగా చెప్పాలి. దీంతో దొంగల ఆచూకీ కోసం క్లూస్‌టీంకు సమాచారం అప్పగించగా అనంతపురం నుండి వచ్చిన ముగ్గురు సభ్యుల బృందం ఆధారాలు సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## 29 కోట్లతో ఉపాధి హామీ పనులు

అగళి, నవంబర్ 10 ప్రభాతవార్త : ఈ ఏడాది 29 కోట్లతో ఉపాధిహామీ పనులను జరపనున్నట్లు ఏపిఓ శివన్న తెలిపారు. మండల వ్యాప్తంగా 29.85 కోట్లు పనులను 2022, 23 సంవత్సరంలో పూర్తి చేయాలని ఇందుకోసం గ్రామ సభలు నిర్వహించి గ్రామాల్లో ఏఏ పనులు అవసరమో గుర్తించామని ఏపిఓ తెలిపారు. మొక్కల పెంపకం, ఫారంపాండ్ల పూడిక తీత, కందకాలఏర్పాటు, అమృత్‌సరోవర్ పనులు, చింత, దానిమ్మ, నేరేడు, ఇలా వివిధ రకాల పండ్ల తోటల పెంపకంతోపాటు పూల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సదావకాశాన్ని మండలంలోని రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపిఓ శివన్న,ఈసి శ్రీధర్, టిఎ వెంకటప్పలు వివరాలను తెలిపారు. సంవృద్ధిగా మండలంలో ఉపాధి హామీ పనులు చేసుకుని మండలాన్ని అభివృద్ధి చేసుకోవాలన్న ఉద్దేశ్యంతో ఇన్ని కోట్ల పనులను గుర్తించినట్లు తెలిపారు.

## పెళ్లికాలేదని మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య


మృతి చెందిన ఈరన్న

గుడిబండ, నవంబర్ 10 ప్రభాతవార్త : మండల పరిధిలోని ఇటికేపల్లి గ్రామానికి చెందిన బిలియప్ప కుమారడు ఈరన్న(30) మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. ఇటికేపల్లి గ్రామానికి చెందిన ఈరన్న యుక్త వయస్సు అయిపోయినదని, తనకు వివాహం కాలేదని, తనకు మతిస్థిమితం వల్ల వివాహంకావడం లేదని జీవితంపై విరక్తి చెంది చనిపోవాలని ఉద్దేశ్యంతో పొలం వద్దకు వెళ్లి వస్తానని వారి కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లగా అతనికి ఉన్న దిగులుతో వారి పొలమునకు పోవు దారిలో రాజమ్మ పొలం గట్టు వద్ద ఉన్న పెద్ద చింత చెట్టు కొమ్ముకు తన పంచతో ఉరివేసుకుని వేలాడుతూ చనిపోయి ఉండగా పక్కపొలం వారు చూసి వారి రక్త బంధువులకు తెలిపారని సదరు ఈరన్న చనిపోవుటకు కారణం మతిస్థిమితం వల్ల, పెళ్లిక ఆలేదని జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకుని చనిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

## రాకెట్ల గ్రామంలో పైలేరియా ఎండమిక్ సర్వే

- వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం

ఉరవకొండ, నవంబర్ 10 ప్రభాతవార్త

మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో గురువారం రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం పైలేరియా ఎండమిక్ సర్వే కొనసాగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌నాయక్ బృందం ఇంటింటికీ వెళ్లి బోధకాల వ్యాధిని గుర్తించడానికిగాను రక్తపు నమూనాలను సేకరించింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సేకరించిన రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపి పరీక్షించిండం జరుగుతుందని తెలిపారు. ఈ సర్వే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాల్లో నిర్వహించడం జరుగుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగరంగయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మీనాయక్, సూపర్‌వైజర్ శ్రీధర్‌మూర్తి, ఏఎన్‌ఎంలు పద్మావతి, సలీమా బేగం, అనూష తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదా ఇవ్వని ప్రధాని రాష్ట్రంలో అడుగు పెట్టరాదు

-కాంగ్రెస్ పార్టీ పెనుకొండ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పాలసముద్రం నరసింహులు


పాలసముద్రం నరసింహులు (ఫైల్‌ఫోటో)

గోరంట్ల, నవంబర్ 10 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రజలను నిట్ట నిలువునా మోసం చేసిన ప్రధాని మోడి రాష్ట్రంలో పర్యటించే నైతిక హక్కు కోల్పోయారని గురువారం పాత్రికేయుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పెనుకొండ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పాలసముద్రం నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తామని తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధి పాదాల చెంత వాగ్దానం చేసి, రాజధానికి ప్రత్యేక నిధులు ఇస్తామని విభజన చట్టంలో పొందుపరిచిన హామీలన్నీ అమలు చేస్తామని నయవంచపు పలుకులు పలికి ప్రజలను మోసపుచ్చారని ఎంతో మంది బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసి తనకు ఆత్మీయులుగా వున్న కార్పోరేట్ శక్తులకు దారాదత్తం చేయడటానికి ముందంజలో వున్నాడన్నారు. ఇలాంటి ప్రధాని మోడి ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వస్తున్న సందర్భంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి భారతీయ జనతాపార్టీ కంటే పోటీపడి సభ ఏర్పాట్లకు తహతహలాడుతున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి రాయలసీమ పౌరుషం వుంటే రాష్ట్రానికి రావాల్సిన నిధులు, విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను అమలు చేయాలని ప్రధాన మోడీని బహిరంగసభలో నిలదీయాలన్నారు. ఇప్పటి రాజకీయ పరిస్థితులు చూస్తుంటే ముందస్తు ఎన్నికలు వచ్చే సూచనలు వున్నాయని ఇది గుర్తు పెట్టుకుని శ్రీహరి సన్నిధిన ఇచ్చిన హామీలను నిరూపించుకుని రాష్ట్ర ప్రజలకు మేలు చేయాలని ఆయన కోరారు.

## గార్మెంట్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

-ఎఐటియుసి నాయకుల నిరసన


నిరసన తెలుపుతున్న దృశ్యం

గోరంట్ల, నవంబర్ 10 ప్రభాతవార్త : మండలంలోని వుట్టగుండ్లపల్లి పంచాయతీ గుంతపల్లి వద్ద వున్న నిషా డిజైన్స్‌లో కార్మికులకు అన్ని సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి నాయకులు గురువారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ గార్మెంట్స్ కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని, రవాణా సౌకర్యాలు కల్పించాలని, గత నెలలో 29న మహిళా కార్మికులు గార్మెంట్స్ ఎదురుగా నిరసన తెలిపిన వారంలోపు కార్మికుల సమస్యలు పూర్తి పరిష్కరిస్తామని హామి ఇచ్చి ఇంత వరకు కార్మికుల సమస్యలు ఏమాత్రం పట్టించుకున్న పాపానపోలేదని ప్రస్తుత పరిస్థితుల్లో నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతుంటే మాకిచ్చే జీతాలకు పిల్లలను పోషించలేక జీవనం సాగడం లేదని మా పొట్ట కొట్టకండంటూ మాకు జీతాలు పెంచాలంటూ రవాణా సౌకర్యంలో భాగంగా బస్సు సౌకర్యం కల్పిస్తామని ఇంత వరకు కల్పించలేదని నిషా గార్మెంట్స్ కార్మికులు సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ కార్య క్రమంలో రామకృష్ణ, మనోహర్, వెంకటేష్, శంకర్, మహేష్, బాబు, మైలారప్ప, పాల్గొన్నారు.

## గ్రామస్తులు సిమెంటు బెంచీలు వితరణ ..ఇతరులకు ఆదర్శం

-సేవాకార్యక్రమలాకు ప్రాధాన్యత యివ్వండి


దాతలకు సత్కారం

కుందుర్పి, నవంబర్,10, ప్రభాతవార్త : మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామస్తులు సిమెంటు బెంచీలు వితరణ చేసినందుకు దాతలకు దుశ్శాలువాలతో ,పూలమాలలు వేసి సత్కరించడం జరిగింది ఈసందర్భంగా సభాఅధ్యక్ష్యలు పాఠశాల హెచ్‌యం నాగరాజు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో జిల్లాలో తొలిఅడుగు వేసింది అర్‌డిటి సంస ్థ ఫౌండర్ ఫాదర్ ఫేర్రర్ అని ప్రస్తుతం సంస ్థ సేవలు కొనసాగు తున్నవని హెచ్‌యం కొనియాడారు కుందుర్పిలో గ్రామస్తులు అడిగిన తక్షణమే స్పందించి దాతలుగా ముందుకు వచ్చి సిమెంటు బెంచీలు వేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు పరియావరణంలో భాగస్వామ్య సంస్థ అయిన అర్‌డిటి, డైరెక్టర్ రామకృష్ణ ఏటియల్ జయచంద్రారెడ్డి సందించి విశాలప్రదేశాన్ని అక్రమించే 12 అడుగులు ఏత్తుగల 400చెట్లు యివ్వడం జరిగిందని హెచ్‌యం నాగరాజు సభలోపేర్కొన్నారు ప్రజా ప్రతినిదులు మాట్లాడడం జరిగింది అనంతరం చెట్లు నాటడం జరిగింది ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారుతేశ్వరిరామూర్తి జెడ్పిటిసి బి రాధాస్వామి యంపిపి కమలమ్మనాగరాజు యంపిడిఓ నారాయణస్వామి మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రీ పేరెంట్సు కమిటీ చైర్మన్ లక్ష్మణమూర్తి యంఅర్‌పియస్ జిల్లా అధ్యక్షులు వైబి ఓబయ్య యంపిటిసీలు వార్డు సభ్యులు ఉపాద్యాయులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం ప్రిన్సిపాల్, వార్డెన్లకు చార్జ్ మెమోలు

-42 బస్తాల బియ్యం అధికంగా నిల్వవుండటంతో డీసీఓ చర్యలు


జీయంసీ బాలయోగి సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం దృశ్యం

ఉరవకొండ, నవంబర్ 10 ప్రభాత వార్త : పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీ శివార్లలోగల జీఎంసీ బాలయోగి (బి.ఆర్. అంబేద్కర్) సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మితోపాటు ప్రస్తుత వార్డెన్‌లకు జిల్లా ఉన్నతాధికారులు చార్జ్ మెమోలు జారీ చేసినట్లు తెలిసింది. చాలా కాలంగా ఈ గురుకులం అధికారుల వైఖరి, నిర్లక్ష్యంపై అనేక పిర్యాదులున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ బాలాజీనాయక్ గురుకులాన్ని సందర్శించిన సమయంలో ఉండాల్సిన నిలువకంటే 42 బస్తాల బియ్యం అధికంగా నిలువ ఉంచినట్లు గుర్తించి ఆ బియ్యాన్ని ఎందుకు నిల్వ ఉంచారని వివరణ కోరగా ప్రిన్సిపాల్, వార్డెన్ నుండి సరైన సమాధానం లేకపోవడంతో ఇరువురికి చార్జ్ మెమోలు జారీ చేసినట్లు సమాచారం. అంతే కాకుండా ఈ విషయాన్ని ఆయన రాష్ట్ర సాంఘిక సంక్షేమ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

## సీయంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే


సీయంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ, నవంబర్ 10 ప్రభాతవార్త : పట్టణంలోని 14వ వార్డుకు చెందిన సాజిదా అనే మహిళకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీయంఆర్‌ఎఫ్) కింద వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన 15వేల రూపాయల ఆర్థిక సాయం చెక్కును మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి బాధితురాలి భర్తకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పేదలకు ఎప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్ధులకు వ్యాసరచన పోటీలు

**గాండ్లపెంట, నవంబర్ 10, ప్రభాతవార్త:**



విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తున్న బ్యాంక్ మేనేజర్

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజిలెన్స్ అవగాహన వారోత్స వాల సందర్భంగా మండలంలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆద్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా కరప్షన్ ఫర్ ఇండియా ఫర్ డెవలప్‌నేషన్ అవినీతి నిరోధక , భారతదేశ అభివృద్ధి అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన అజయ్‌కుమార్‌రెడ్డి, మహమ్మద్ షాహిల్, అజయ్, లిఖిత, మిస్బా, షర్మీల విద్యార్థులకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ అభిరామ్, శ్రావన్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మహేష్, ప్రదానోపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మహబూబ్ భాషా, బివి వెంకటరమణారెడ్డి, రమణారెడ్డి, అబ్దుల్ అజీజ్, మన్సూర్, బ్యాంక్ సిబ్బంది శివశంకర్, జైపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## ఇద్దరు మోసగాళ్ళు అరెస్ట్

**తనకల్లు, నవంబర్ 10, ప్రభాతవార్త**



నిందితులను చూపుతున్న ఎస్సై

కదిరి డిఎస్పి భవ్యకిషోర్ ఆదేశాల మేరకు కదిరి రూరల్ సిఐ శివశంకర్‌నాయక్ పర్యవేక్షణలో నకిలీ పూసల దండను బంగారు పూసల దండ అని మోసం చేస్తున్న వారిని స్థానిక ఎస్సై రామ్‌భూపాల్ యాదవ్ అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకోవడం జరిగింది. నకిలీ పూసలదండలను మోసం చేసిన వారి దండలను తక్కువ ధరలకు ఇద్దరు అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై రంగంలోకి దిగి అరెస్ట్ చేయడం జరిగింది. కర్ణాటక రాష్ట్రం, చిక్‌బల్లాపూర్, చేలూరు తాలూకా , నల్లగుట్టపల్లిమండలం, పేమయ్యగారిపల్లి గ్రామానికి చెందిన హెచ్‌కే ప్రశాంత్, అదే గ్రామానికి చెందిన మరో నింధితుడు అంజిన్‌పూర్ కొడుకు ఆర్.శంకరలు నకిలీ దండలను బంగారు పూసల దండ అని మోసం చేస్తున్నట్లు సమాచారం రావడంతో అరెస్ట్ చేయడం జరిగింది. నింధితుల నుండి సుమారు 2 కేజిల బరువు గల 20 నకిలీ బంగారు పూసల దండలు స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఎస్సైతో రాంభూపాల్‌తో పాటు పిసిలు నారాయణస్వామి, రంజిత్‌నాయక్, నారాయణరెడ్డి, కిశోర్‌నాయక్‌లు ఉన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

**నంబులపూలకుంట, నవంబర్ 10, ప్రభాతవార్త:**



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిపి, ఎంపిడిఓ

మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపిపి రాము, ఎంపిడిఓలు గురువారం ఆకస్మి కంగా తనిఖీ చేయడం జరిగింది. ఇందులో బాగంగా పలు రికార్డు లను పరిశీలించడం జరిగింది. అలాగే ఆసుపత్రి అభివృద్దికి ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఎంతమేరకు వినియోగించారో విషయమై వైద్య సిబ్బందితో ఆరా తీయడం జరిగింది. అనంతరం ఏఎన్‌యంలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అంజినమ్మ, వైద్యాధికారి డాక్టర్ ఆసియా, నాయకులు తిరుమలనాయుడు, రంగారెడ్డి, శ్రీరాములు, వాటర్ షెడ్ చైర్మెన్ బయారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి బ్యాడ్జింటన్ టోర్నమెంట్‌కు క్రీడాకారులు



జిల్లా స్థాయి బ్యాడ్జింటన్ టోర్నమెంట్‌కు ఎంపికైన క్రీడాకారులు

**అనంతపురం న్యూటౌన్, నవంబర్ 10 ప్రభాతవార్త**

స్కూల్‌గేమ్స్‌లో భాగంగా గురువారం జిల్లా స్థాయి బ్యాడ్జింటన్ టోర్నమెంట్, ఎంపికలు అనంతపురం ఇండోర్ స్టేడియంలో జరిగాయి. ఇందులో ఇదివరకే జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీలు ఎంపికైన 14 నియోజకవర్గాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలు బాలబాలికలకు అండర్14, 17 విభాగాల్లో జరిగాయి. దాదాపుగా 250మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అనంతపురం జిల్లా స్కూల్ గేమ్ కార్యదర్శి రవికుమార్, సత్యసాయి జిల్లా స్కూల్ గేమ్ సెక్రెటరీ అంజన్న, జిల్లా టోర్నమెంట్ కోఆర్డినేటర్ ఎల్.నాగరాజు, డిఎస్‌డిఓ రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్, జి.నాగ రాజు, రఘు, శివ, ఈశ్వరి, సమీరా, సంజీవ్ అండర్-17 బాయ్స్ ధనుష్ అనంతపూర్, విగ్నేష్ కదిరి, అంకిత్ కదిరి, సుశాంత్, అనంతపుం కిషోర్, తాడిపత్రి అండర్ 14 గర్ల్స్ యజ్ఞశ్రీ హిందూపురం, విష్ణు సహస్ర అనంతపూర్, నక్షత్ర అనంతపూర్, సాయి శ్రీదీప్తి రాయదుర్గం, వెన్నల అనంతపూర్, అండర్-17 గర్ల్స్ ఈశాని అనంతపురం, జాస్మిన్ తాడిపత్రి, అక్షయ తాడిపత్రి, సంజన అనంతపురం, జానవి అనంతపూర్‌లను ఎంపిక చేశారు.

## సీఎన్జీ సెగ్మెంటులోకి ప్రవేశించిన టయోటా కిర్లోస్కర్ మోటార్

**అనంతపురం, నవంబర్ 10 ప్రభాతవార్త బ్యూరో**



కస్టమర్-ఫస్ట్ ఫిలాసఫీకి అనుగుణంగా టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం)సీఎన్జీ సెగ్మెంట్ లోకి తన ప్రవేశాన్ని ప్రకటించింది. తద్వారా టయోటా గ్లాంజాస్, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ మోడల్ లైనప్ రెండింటిలోనూ వినియోగదారులు ఎంచుకోవడానికి మరిన్ని మోడళ్లను అందిస్తోంది. కస్టరమర్లు ఎంచుకోవడానికి ఎకో ఫ్రెండ్లీ, చౌకైన ఆప్షన్లను అందిస్తోంది. తద్వారా భారతీయ వినియోగదారులు వివిధ రకాల రవాణా అవసరాలను తీరుస్తుంది. ఈ సందర్భంగా టికెఎం సేల్స్, స్ట్రాటజిక్ మార్కెటింగ్ అసోషియేట్ వైస్ ప్రెసిడెంట్ అతుల్‌సూద్ మాట్లాడుతూ.. కస్టమర్ కేంద్రంగా ఉండే కంపెనీ కావడం వల్ల, కస్టమర్ల ఆసక్తికి పెద్దపీట వేయడాన్ని టికెఎం విశ్వసిస్తుంది. టయోటా వద్ద మా లక్ష్యం ఎప్పుడూ కస్టమర్ల ఆకాంక్షలపై స్పష్టమైన దృష్టి సారించడం ద్వారా, మా కస్టమర్లకు అత్యంత ఆచరణీయమైన ఉత్పత్తులు, సేవలను అందించడం ద్వారా మార్కెట్ అవసరాలను తీర్చడమే, అదే దార్శనికతను దృష్టిలో ఉంచుకుని, సీఎన్జీ సెగ్మెంట్‌లో మా ప్రవేశాన్ని ప్రకటించడానికి మేము సంతోషిస్తున్నాము. మా అత్యంత డిమాండ్ ఉన్న రెండు మోడళ్లు టయోటా గ్లాంజా, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ కోసం సీఎన్జీ వేరియంట్లలో డ్రైవింగ్ అందిస్తున్నాము. ఈ కొత్త మోడళ్లతో మా కస్టమర్లు ఎంచుకోవడానికి మార్కెట్‌లో మరిన్ని ఆప్షన్లను పొందుతారని మేం విశ్వశిస్తున్నామన్నారు. టయోటా వాహనాన్ని సొంతం చేసుకునే ఆనందంతోపాటు, మా వినియోగ దారులు తక్కువ నిర్వహణ ఖర్చు, టయోటా వాహనాలు అందించే పూర్తి మానసిక ప్రశాంతతో కూడా ప్రయోజనం పొందుతారన్నారు. త ద్వారా అందరికీ సామూహిక ఆనందాన్ని అందిస్తారని ఆయన పేర్కొన్నారు.

## గడపగడపకు ఇందుకూరు..

**ముదిగుబ్బ, నవంబర్ 10 ప్రభాతవార్త**



కార్యక్రమంలో పాల్గొన్న ఇందుకూరు

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడపగడపకు కార్యక్రమాన్ని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు గురువారం వైసిపి మండల కన్వీనర్ ఇందుకూరు నారాయణ రెడ్డి మండల కేంద్రంలో 7,8 వార్డుల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ గడపగడపకు అందుతున్నాయా లేదా అంటూ ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంబడి వందల మంది కార్యకర్తలు, సర్పంచులు వున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఏవైనా సమస్యలు వున్నాయా అని అడుగుతూ వాటిని అక్కడికక్కడే పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతేకాకుండా సంక్షేమ పథకాలు అందుతున్న ప్రతి ఒక్కరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశించిన 175 స్థానాలు వచ్చే విధంగా ప్రతి ఒక్కరు ఆశీర్వదించాలని కోరారు. అంతేకాకుండా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి వైసిపి కార్యకర్త ముఖ్యమంత్రికి సైనికుల్లా పనిచేస్తూ బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. త్వరలోనే రెండవ విడతలో అర్హులైన వారం దరికి ఇప్పటికే స్థలాలు మంజూరు చేశామని ఆ స్థలాల్లో పక్కా గృహాలు నిర్మించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ సర్పంచు దేవరకొండ లక్ష్మీదేవిచంద్రాయుడు, స్థానిక నాయకులు లోకేష్‌రెడ్డి, యల్లంపల్లి చంద్ర, దండు జయమ్మ, లక్ష్మీదేవి, శ్రావణకుమార్, నివేష్, కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పలువురి ఆరోగ్య పరిస్థితిపై పరామర్శించిన 'పూల'



విశ్వేశ్వరరెడ్డి తల్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న పూల శ్రీనివాసులురెడ్డి

**తలుపుల,నవంబర్10,ప్రభాతవార్త:**

మండంలంలోని పలువురి ఆరోగ్య పరిస్థితిని రాష్ట్ర సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసులురెడ్డి పరామర్శించారు.మండలకేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన ఉపాధ్యాయుడు రఘునాథరెడ్డి గుండెకు శస్త్ర చికిత్స చేయించుకోవడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.అదే విదంగా శ్రీసాయి స్కూల్ కరస్పాండెంట్ విశ్వేశ్వరరెడ్డి తల్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.మండలపరిదిలోని వైయస్సార్ నగర్‌కు చెందిన రామక్రిష్ణారెడ్డికి గుండెకు శస్త్ర చికిత్స కావడంతో వారిని పరామర్శించారు.బీసీ కాలనీకి చెందిన హరీకి కాలుకు గాయం కావడంతో అతనింటికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు.అదే విదంగా రెడ్డివారిపల్లికి చెందిన మల్లారెడ్డి తల్లి మరణించడంతో పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వైస్ యంపీపి మహేశ్వర్‌రెడ్డి,మండల కన్వీనర్ శంకర,మండల ఈడిగ సంఘం అధ్యక్షులు శ్రీశైలం రమణ,ఉత్తారెడ్డి,శివారెడ్డి,జహీర్,సలీం తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి కొత్త పుస్తకాలు

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 11, ప్రభాతవార్త**



గ్రంథాలయానికి చేరిన పుస్తకాలు

పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి కొత్త పుస్తకాలు వచ్చినట్లు గ్రంథాలయ అధికారి రాజబాబు తెలిపారు. వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొని నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర గ్రంథాలయ శాఖ ఓడీచెరువు గ్రంథాలయానికి 360 పుస్తకాలు గురువారం పంపించారన్నారు. కావున నిరుద్యోగులు గ్రంథాలయాన్ని సందర్శించి పోటీ పరీక్షల కోసం పుస్తకాలను చదివి సన్నంధ్ధం కావాలని ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కోరారు.

## కృష్ణయ్యకు స్వాగతం పలుకుదాం

**బిసి సంఘం జిల్లా అధ్యక్షులు జిట్టా రామ్మోహన్ యాదవ్.**



సమావేశంలో మాట్లాడుతున్న బిసి సంఘం అధ్యక్షులు జిట్టా రామ్మోహన్ యాదవ్

**అనంతపురం రూరల్,నవంబర్10ప్రభాతవార్త:**

రాజ్యసభ సభ్యులు,బిసి సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఈ నెల11న జరిగే కనకదాసు జయంతి ఉత్సవాలకు విచ్చేస్తున్న సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని బిసి నాయకులందరు ఆర్.కృష్ణయ్యకు ఘన స్వాగతం పలుకుదామని జిల్లా బిసి సంఘం అధ్యక్షులు జిట్టా రామ్మోహన్ యాదవ్ తెలిపారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనకదాసు జయంతి వేడుకలను నిర్వహిస్తున్న సందర్భంగా వైకాపా రాజ్య సభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా విచ్చేయడం జరుగుతుందని ఆయనకు ఉమ్మడి జిల్లాలో బిసి నాయకులందరుతో కలసి ఘన స్వాగతం పలకడం జరుగుతుందన్నారు. ఈ స్వాగత కార్యక్రమానికి బిసి నాయకులంత తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఆధార్ కేంద్రంను ప్రారంభించిన ఈఓఆర్‌డి

**తనకల్లు, నవంబర్ 10, ప్రభాతవార్త:**

మండలం పరిధిలోని తవలం గ్రామ సచివాలయం నందు నూతనంగా ఆధార్ సెంటర్‌ను గురువారం ఈఓఆర్‌డ ీప్రారంభించడం జరిగింది. ఆధార్‌సెంటర్ ప్రజలకు అందుబాటులో ఉంటుందని వృద్దులు, పిల్లలు,మహిళలు ఆధార్ సేవలకు ఇతర ప్రాంతాలకు వెల్లకుండా తవళం గ్రామ సచివాలయం నందు పొందవచ్చును. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ , ఆధార్ అప్డేషన్‌అడ్రస్ మార్పు, ఆధార్‌కు ఫోన్ నెంబర్‌ను అనుసందానం, నేమ్ కరెక్షన్ మొదలగు అన్ని సేవలను పొందవచ్చును. ముఖ్యంగా తవళం గేమేనాయక్ తండా, మల్లిరెడ్డిపల్లి సచివాలయ పరిధిలోని ప్రజలు మరియు సమీప ఇతర గ్రామాలలోని ప్రజలు ఈ ఆధార్ సెంటర్ యొక్క సేవలు వినియోగించుకోవలసిందిగా తెలిపారు.

## దరఖాస్తులకు చివరి తేది పొడిగింపు

**అనంతపురం న్యూటౌన్, నవంబర్ 10 ప్రభాతవ్రా**

ప్రధానోపాధ్యాయులు అకౌంట్ టెస్ట్ పేపర్-1, 2 దరఖాస్తులను నమోదు చేసుకోవడానికి చివరితేదినిపొడిగించినట్లు డిఇఓ ఒకప్రకటన ద్వారా తెలియజేశారు. ఆన్‌లన్‌లో అప్‌లోడ్ చేయడానికి నవంబర్ 1 నుంచి అందుబాటులో ఉందని, పరీక్ష రుసుము రెండు పేపర్లకుగాను 150, ఒక పేపర్‌కు 100 కలదని, ఈనెల 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అందులో పేర్కొన్నారు. ఆలస్య రుసుము 60తో ఈ నెల 28 లోగా చెల్లించాలని, నమోదు చేసిన అప్లికేషన్ తేది 30లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించవలసినగా డిఇఓ వారు తెలిపారు.

## జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యం

**-కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి**

**తాడిపత్రిరూరల్, నవంబర్ 10 ప్రభాతవార్త**



పథకాలు వివరిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

ముఖ్యమంత్రి జగనన్న తోనే సంక్షేమ పాలన సాధ్యమని యువనాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బోడాయిపల్లి గ్రామంలో గురువారం నిర్వ హించిన జనచైతన్య యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రతి ఇంటికి వెళుతూ ప్రజలకు ప్రభుత్వం నుండి అందుతున్న పథకాలను వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అన్ని వర్గాల ప్రజలకు నవరత్న సంక్షేమ పథకాలను అందచేస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి ముఖ్యమంత్రి అన్ని రకాల తోడ్పాటునందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లప్పుడూ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అందుబాటులో వుంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ కేతిరెడ్డి కుటుంబం రుణపడి వుంటుందని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్‌సి ఓబుళరెడ్డి, సర్పంచు రామాంజనమ్మ, ప్రతాప్‌రెడ్డి, రామాంజులరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గర్భవతులకు వైద్యపరీక్షలు



హాజరైన గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

**యల్లనూరు, నవంబర్ 10 ప్రభాతవార్త**

మండలంలోని తిమ్మంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కీర్తన, డాక్టర్ సాయినాగశ్రీల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా హాజరైన 42 మంది గర్భవతులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం గర్భవతులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తలు, సూచనలు తదితర విషయాలను వివరించారు. అదేవిధంగా వ్యక్తిగత పరిశుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యత, రక్తహీనత వల్ల కలిగే నష్టాలు, ఆసుపత్రిలో జరిగే ప్రసవాల యొక్క ప్రాముఖ్యత గురించి తెలియచేశారు. వైద్యపరీక్షలకు హాజరైన గర్భవతులకు చింతకాయమంద గ్రామానికి చెందిన దాసరి ప్రసాద్, తులసి దంపతులు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్య క్రమంలో ఎంపిహెచ్ఇఓ వీరనారాయణ, పిహెచ్ఎన్ జగదాంబిక, సూపర్‌వైజర్లు రాము, విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి భాను, భార్గవి, సుప్రియ, దివ్య, ఎఎన్ఎంలు వెంకటలక్ష్మి, జాస్మిన్, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, దిలీప్, సుమంత్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## డాక్టర్‌కు సన్మానం



డాక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**యల్లనూరు, నవంబర్ 10 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రసాద్‌ను సిబ్బంది గురువారం సన్మానించారు. డాక్టర్ ప్రసాద్ ప్రమోషన్‌పై వెళుతున్న సందర్భంగా సన్మాన కార్య క్రమాన్ని ఏర్పాటు చేసిన ఆయనను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ డాక్టర్ ప్రసాద్ ప్రజలకు అందుబాటులో వుంటూ వైద్యసేవలు అందించేవారన్నారు. కరోనా సమయంలో సిబ్బందితో పాటు అందుబాటులో వుండి రోగులకు మంచి వైద్యసేవలు అందించారని ఆయన సేవలను కొనియాడారు. ఆయన స్థానంలో లోకేష్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మధుకుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు తిరుపాలయ్య, విజయలక్ష్మి, ఎల్‌టి ప్రసాద్, హెల్త్ సిబ్బంది కిరణ్, నాగేశ్వర్‌రెడ్డి, ఎఎన్ఎం శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## సాయినాథునికి పంచామృతాభిషేకాలు

**యల్లనూరు, నవంబర్ 10 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని కస్తూరిబా గురుకుల పాఠశాల ఎదురుగా నూతనంగా నిర్మించిన శ్రీషిరిడిసాయిబాబా ఆలయంలో గురువారం విశేషపూజలు నిర్వహించారు. కార్తీకమాసం పురస్కరించుకుని ఉదయం బాబాకు పంచామృతాభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా మధ్యాహ్నాహారతి, కాకడాహారతి తదితర పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని బాబాను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## ముఖ్యమంత్రిని కలిసిన మదాసి కురువ, మదారి కురువ సంఘాల ప్రతినిధులు



ముఖ్యమంత్రిని సన్మానిస్తున్న ఎంపి గరంట్ల మాధవ్ తదితరులు

**అనంతపురం, నవంబర్ 10 ప్రభాతవార్త బ్యూరో**

సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్, మదాసి కురువ, మదారి కురువ సంఘాల ప్రతినిధులు మర్యాద పూర్వకంగాకలిశారు. ఇప్పటి వరకు మదాసి కురువ, మదారి కురువ కులాలకు ఇచ్చే కుల దృవీకరణ పత్రాన్ని ఆర్డిఓ పరిధి నుంచి తహశీల్దారు పరిధిలోకి మారుస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తమకు ఎంతో ప్రయోజనకరమని సంతోషం వ్యక్తం చేసి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కురువ, సాంప్రదాయం ప్రకారం కంబలి కప్పి ముఖ్యమంత్రిని సన్మానించారు. తమ సామాజిక వర్గం వారు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఎంపి గోరంట్ల మాధవ్‌తోపాటు ముఖ్యమంత్రిని కలిసిన మదాసి కురువ, మదారి కురువ సంఘాల ప్రతినిధులు సుంకన్న, శివలింగ, సోమలింగ, సాయిరామ్, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే పెద్దారెడ్డి పరామర్శ



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే

**తాడిపత్రిఅర్బన్, నవంబర్ 10 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణానికి చెందిన స్టోర్ డీలర్ సుబ్రమణ్యం మాతృమూర్తి సుబ్బలక్ష్మమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి డీలర్ సుబ్రమణ్యం ఇంటికి చేరుకుని ఆయన మాతృమూర్తి సుబ్బలక్ష్మమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

## తాడిపత్రిలో గోగ్రీన్ కార్యక్రమం



మొక్క నాటుతున్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, నవంబర్ 10 ప్రభాతవార్త**

పట్టణంలో గురువారం మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.సి అశ్మిత్‌రెడ్డిల ఆధ్వర ంలో గోగ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మారుతున్న పర్యావరణ పరిస్థితుల దృష్ట్యా కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించడం కోసం మొక్కలు నాటడం ఒక్కటే పరిష్కారమని అందుకే తాడిపత్రిలో మనవంతు కృషి కోసం ఎప్పటి నుండో పచ్చదనం పరిరక్షణ కోసం పాటుపడడం జరుగుతోందని దీనికి ప్రజలందరూ కూడా ఎంతో అద్భుతంగా సహకరించారని వారు పేర్కొన్నారు. మరోమారు మనం పట్టణ వ్యాప్తంగా మొక్కటు నాటడం మీద దృష్టి సారిద్దామని ముఖ్యంగా తల్లిదండ్రులు చిన్నపిల్లలకు కూడా మొక్కలు నాటడం యొక్క ఆవశ్యకతను తెలియచేసి వారితో ఒక మొక్కను నాటించి ప్రతి రోజు వాటి సంరక్షణ కోసం కొంత సమయాన్ని వెచ్చించేలా చేయాలని సూచించారు. ఇది వారిలో సామాజిక బాధ్యతను పెంపొందిస్తుంది సమాజ శ్రేయస్సులో తాము పాలుపంచుకున్నామన్నా ఆనందం వారికి వుంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపికి చెందిన కాంట్రాక్టర్ మల్లికార్జునరెడ్డి, కౌన్సిలరు మల్లికార్జునతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న ఎంఇఓ నాగరాజు

**తాడిపత్రిఅర్బన్, నవంబర్ 10 ప్రభాతవార్త**

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంఇఓ నాగరాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఆర్‌పిజి పురపాలక ప్రాథమిక పాఠశాల ఆవరణలో నేస్తం ఫౌండేషన్, మహేంద్ర ఫైనాన్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ఎంఇఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు నాశనం అవుతున్న పర్యావరణాన్ని మొక్కలను నాటడం ద్వారా కాపాడాలన్నారు. అదేవిధంగా పర్యావరణానికి హాని చేసే వాయువులను ప్రజలు తగ్గించాలని తద్వారా ఓజోన్ పొరను సంరక్షించాలన్నారు. నేస్తం ఫౌండేషన్ కో ఆర్డినేటర్ మీన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం జరిగిందన్నారు. ప్రతి ఒక క్రరు తమవంతు బాధ్యతగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. అప్పుడే వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిజి పురపాలక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వరలక్ష్మి, ఆదిశేఖర్‌రెడ్డి, వెంకటేశులు, అరుణ, సాయిలక్ష్మి, పద్మావతి, మహేంద్ర ఫైనాన్స్ ఉద్యోగులు ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, రామకృష్ణ, వెంకటేష్, ప్రశాంత్, తిప్పయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెద్దవడుగూరులో ఫైలేరియా సర్వే



రక్తపూతలు తీస్తున్న దృశ్యం

**పెద్దవడుగూరు, నవంబర్ 10 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో డాక్టర్లు శ్రీనివాసబాబు, అమర్‌నాథ్‌ల ఆధ్వర్యంలో గురువారం ఫైలేరియా సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 300 మందికి రక్తపూతలు తీశారు. ప్రస్తుతం వ్యాపిస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా వుండాలని వారు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి రామచంద్రనాయక్, ఎంపిహెచ్ఇఓ వినయ్‌కుమార్, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఎంఎల్ హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఎంపిహెచ్ఎలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## నీలకంఠుని అలంకారంలో శ్రీబుగ్గరామలింగేశ్వరుడు

**తాడిపత్రిఅర్బన్, నవంబర్ 10 ప్రభాతవార్త**



పట్టణంలోని పురాతన శ్రీబుగ్గరామ లింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారు నీలకంఠుని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీకమాసం పురస్కరించుకుని ఉదయం స్వామివారికి అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్ శర్మలు అభిషేకాలు నిర్వహించి స్వామి వారిని నీలకంఠుని అలంకారంలో ప్రత్యేక ంగా అలంకరించారు. శ్రీరాజ రాజేశ్వరిదేవి అమ్మవారికి అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామికి, నవగ్రహాలకు చంద్రశేఖర్‌శర్మ, నందుస్వామిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

## బహిరంగ వేలం వాయిదా

**తాడిపత్రిరూరల్, నవంబర్ 10 ప్రభాతవార్త**

మండలంలోని ఆలూరుకోనలో తలనీలాలు, పార్కింగ్, కళ్యాణమండపం, వసతిగదులు, సత్రములు, గెస్ట్‌హౌస్ లీజు, హోటల్ నిర్వహణ, టెంకాయలు, కిరాణం, కూల్‌డ్రింక్స్, ఫోటోలు, బొమ్మల అంగడి నిర్వహణకు సంబంధించి గురువారం నిర్వహించిన బహిరంగవేలం వాయిదా పడినట్లు ఆలయ ఇఓ నరసయ్య తెలియచేశారు. సరైన వేలంపాట రానిపక్షంలో వేలం వాయిదా వేయడం జరిగిందని ఇఓ తెలిపారు.

